

కఠిన చట్టాలు తేవాలి

కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారం జరిగిన నేపథ్యంలో కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. నిందితులను కఠినంగా శిక్షించినప్పుడే దాడులకు పాల్పడేందుకు మరొకరు భయపడతారు. అప్పుడే మహిళలపై దాడులను అరికట్టేందుకు వీలవుతోంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆసుపత్రిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలి.

–పి.పుష్ప, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కొండముది



మహిళలకు రక్షణ లేదు

మహిళలకు ఎక్కడుంది స్వాతంత్య్రం అనిపిస్తోంది. రాత్రి డ్యూటీలు చేసే మహిళలకు రక్షణ లేదు. 8 గంటల పనివేళలు డాక్టర్లకు ఎందుకు లేవు. 36 గంటల డ్యూటీ లేంటి ? ఇంట్లో, పని ప్రదేశంలో విధుల్లో మానసిక ఒత్తిడికితోడు శారీరక హింస ఏమిటి? ఇకపై సహించే పరిస్థితి లేదు. రాత్రి డ్యూటీలు, పని ప్రదేశాల్లో రక్షణకు తగిన చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ హిమని, రేడియాలజిస్ట్, తెనాలి



క్లుప్తంగా

ఆకట్టుకున్న విద్యార్థుల నాటిక



మంగళగిరి: తెలుగు భాష గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేయాలని ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్ఞానసుందరి, రూరల్ సీఐ సీహెచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరపై చట్టాన్ని తీసుకురావాలి

తాడేపల్లిరూరల్ : పంటల మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దుగ్గిరాల మండల కమిటీ సమావేశాన్ని దుగ్గిరాలలో యోహాను అధ్యక్షత నిర్వహించారు. జొన్న శివశంకరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఢిల్లీ రైతాంగ ఉద్యమం మీద ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ బంగ్లాదేశ్ ఉద్యమంతో పోల్చడం సరికాదన్నారు. తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు వ్యవసాయ రంగానికి, గృహ వినియోగదారులకు బిగించే చర్యలను మానుకోవాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం. శివసాంబి రెడ్డి, మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఫిరంగిపురం: మండల కేంద్రంలో గురువారం ఏపీటీఎఫ్ నూతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు పాల్గొని, మాట్లాడారు. నూతన ప్రభుత్వం జీవో నంబరు 117ను రద్దు చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు జిలాని మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమాలు చేస్తేనే పొందుతున్న సౌకర్యాలు నిలబెట్టుకోవచ్చని చెప్పారు. అనంతరం మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా కబీర్‌దాసు, అధ్యక్షుడిగా ఎస్‌డీ జహంగీర్, ఉపాధ్యక్షులుగా జప్తుల్లాఖాన్, ఉషారాణి, డివి. కమల్‌మోహన్, ఖాజాఖాన్, రజియా సుల్తానా, చంద్రిక, ప్రధాన కార్యదర్శిగా టి.భాస్కర్, కార్యదర్శులుగా మొహిద్దీన్, దేవయ్య, ఇబ్రహీం ఖలీల్, షకీలా బేగం, మల్లేశ్వరిలను ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు, ఖలీల్, లక్ష్మీనారాయణ, రమేష్, మూర్తి, దాసు, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఫిరంగిపురం: వనం- మనం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని డ్వామా పీడీ విమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వేప, మద్ది, మునగ పలు రకాల మొక్కలను 17 గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. శుక్రవారం గ్రామాల్లోని రోడ్లకిరువైపులా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారి, ఏపీవో జయకుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

మంగళగిరి: బాల్య వివాహాల వల్ల అనారోగ్యం, రక్తహీనత, ప్రసూతి మరణాలు సంభవిస్తాయని డాక్టర్ పి.అనూష తెలిపారు. పట్టణంలోని ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో డాక్టర్ అనూష మాట్లాడారు. ఆడ పిల్లలు 18 సంవత్సరాల లోపు, మగపిల్లలు 21 సంవత్సరాల లోపు వివాహాలు చేసుకోరాదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాడేపల్లిరూరల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస అన్నారు. గురువారం అంబేడ్కర్ కాలనీ (డైవర్క్ కాలనీ)లో బాల్య వివాహాల వల్ల వచ్చే ప్రభావాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మానస మాట్లాడుతూ కౌమార ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే ప్రభావాలపై బాల బాలికలకు అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి నెలా 4వ గురువారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్యం, రక్తహీనత, ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల్య వివాహాల నష్టాలు వివరిస్తున్న డాక్టర్ ఇందిర

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సి. ఇందిర బాల్య వివాహాల అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబరుకు లేదా 100కు సమాచారం అందించాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, ఎంఎల్ హెచ్‌పీ స్వాతి, ఆరోగ్య కార్యకర్తలు లీల, శ్యామల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీలు..పడిగాపులు

తాడికొండ: తాడికొండ.. పేరుకే ఎస్సీ నియోజవర్గం. కానీ ఆధిపత్యం అంతా ఓ సామాజిక వర్గానిదే. అధికారం వచ్చిందే తడువుగా గ్రామాల్లో టీడీపీకి చెందిన ఆ వర్గ నాయకులు గుత్తాధిపత్యం కోసం తమదైన శైలిలో పావులు కదిపి, ఎమ్మెల్యే కార్యాలయాన్ని సైతం గుప్పెట్లో పెట్టుకున్నారు. ఇందుకు కార్యాలయంలో ఉంటున్న ఓ సామాజిక వర్గ నాయకుడు తోడవడంతో వారి పని సులువయ్యింది. గ్రామాల్లో ఎవరి పోస్టులైనా ఊడపీకాలన్నా.. కొత్త వారికి పోస్టింగ్ ఇవ్వాలన్నా.. సిఫార్సు చేయాలన్నా.. గ్రామానికో ఆధిపత్య సామాజిక వర్గ నాయకుడికి పెత్తనం అప్పజెప్పారు. అన్నీ వారి కనుసన్నల్లోనే జరగాలని హుకుం జారీ చేశారు. ఈ తంతు రెండున్నర నెలలుగా కొనసాగుతోంది. దీంతో ఆ పార్టీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ద్వితీయ శ్రేణి నాయకులు సైతం వారి ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు చక్కర్లు కొడుతున్నారు. ఎన్నికలకు ముందు ఇంటిలో నుంచి బయటకు రాకుండా.. వ్యాపారాలకే పరిమితమై.. రోడ్ల వెంబడి తమను తిప్పి, అన్ని కార్యక్రమాలకు వాడుకున్న సదరు సామాజిక వర్గ నాయకులు ఇప్పుడు అధికారం రాగానే పెత్తనం చలాయిస్తూ..పూచిక పుల్లలా తీసేయడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు అధికారుల బదిలీల ప్రక్రియ చివరి దశకు చేరింది. ఇక నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేయడం అధికారుల దినచర్య అయ్యింది. ఉద్యోగాలు వదిలి గ్రామ, మండల స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇటీవల జరిగిన గ్రామ సభల్లో వేదికలెక్కేందుకు పోటీ పడిన పలువురు టీడీపీ నాయకులు.. తమకు అనుకూలంగా లేని కార్యదర్శులు, వీఆర్వోలను అక్కడి నుంచి పంపించేయాలంటూ హుకుం జారీ చేయడం విశేషం. తాడికొండ మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఫోటోకాల్ ప్రకారం స్టేజీపై ఎక్కవద్దంటూ ఓ నాయకుడికి చెప్పారు. దీంతో ఆయన ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. తమకు అనుకూలంగా పనిచేయనప్పుడు ఇక్కడ ఉండకూడదంటూ ఈ కార్యదర్శికి కరాఖండీగా చెప్పారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



ఫిరంగిపురం: పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీ చైర్మన్‌లు కృషి చేయాలని ఎంఈవో–2 సీహెచ్ రవికాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. రవికాంత్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఎస్‌ఎంసీ చైర్మన్లు ప్రధానోపాధ్యాయులకు సహకరించాలని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్ల స్థితిగతులు తెలుసుకునేందుకు వారంలో రెండు రోజులు ఎస్‌ఎంసీ సభ్యులు, రెండు రోజులు వెల్‌ఫేర్ అసిస్టెంట్లు సామాజిక బాధ్యతగా ఫోటోలు ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. హెచ్‌ఎంలు ప్రతి రోజు ఇన్‌స్పెక్షన్ ఫాంను తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు.

చోరీ కేసు నమోదు

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో ద్విచక్ర వాహనం చోరీ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. వివరాల మేరకు..మూడు రోజుల క్రితం గ్రామంలోని రజక బజారులో ఇంటి బయట నిలిపి ఉంచిన హీరో హోండా ద్విచక్ర వాహనం చోరీకి గురైందని, పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాధితులు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో ఉన్న కోదండ రామాలయం పక్కనే శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు వేద పండితులు దంపతులతో హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పూర్తి చేశారు. 1955లో నిర్మించిన ఈ రామాలయంలో స్థానికంగా ఉండే చింతా శ్రీరామ్ ఆలయ పూజా నిర్వహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో వినాయకుడి దేవాలయాన్ని నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించగా, చింతా శ్రీరామ్-రాంబాయి, పలగాని శ్రీకాంత్- తేజశ్వని, బొర్రా మోహనరావు-ధనలక్ష్మి, పందిరి అనిల్‌కుమార్- శ్రీదేవి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్ఠ గావించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పలగాని గాంధీ, ఉండ్రు కల్యాణ్, కె. సూర్యనారాయణ, ఓలేటి రాము, ప్రముఖ సినీ నటుడు జొన్న రామలింగేశ్వరరావు, టి.నాగేశ్వరరావు (టీఎస్ఆర్ మాస్టర్), శ్రీనివాసరావు, లోకనాథం, భక్తులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న దంపతులు

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాడేపల్లి కృష్ణా కెనాల్ డిపో మేనేజర్లు ధనుంజయ, వర్గీస్, క్యూసి శశికళ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం, ఇతర ఆహార ధాన్యాలతో ఫోర్టిఫైడ్ రైస్ కేర్నల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషక లోపాన్ని నివారించవచ్చని కేంద్రం గుర్తించిందన్నారు. ఈ రైస్‌ను మహిళలకు, పిల్లలకు, బాలింతలకు చాలా అవసరన్నారు. వీరి కోసమే కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందని వివరించారు. నీళ్లతో కడిగినప్పుడు పైకి తేలియడే ఫోర్టిఫైడ్ రైస్‌ని పడవేయకుండా అలాగే ఉంచి వండినట్లయితే మంచి పోషక విలువలు లభిస్తాయని వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఎం.అనూష, చీఫ్ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్, ఆశ వర్కర్లు, నర్సులు, హాస్పిటల్ సిబ్బంది, ఎఫ్‌సీఐ డిపో సిబ్బంది, క్యూసి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

తాడికొండ: ఆటోలు రోడ్డుకు అడ్డంగా నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని తాడికొండ సీఐ కె.వాసు హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో తాడికొండ ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రాజధాని ప్రాంతానికి వెళ్లే వీఐపీలు, వీవీఐపీలు, హైకోర్టు న్యాయమూర్తులు, లాయర్లు పలువురు ప్రముఖులు సంచరించే ప్రాంతం కావడంతో భద్రతాపరంగా, ట్రాఫిక్ పరంగా కొన్ని ఆంక్షలు తప్పవన్నారు. గతంలో లాగా రోడ్లపై నిలిపి అడ్డ దిడ్డంగా వాహనాలు ఉంచితే ఉపేక్షించేది లేదన్నారు. ఓ క్రమ పద్ధతిలో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లాలని సూచించారు. తాడికొండ మీదుగా వెళ్లే వాహనాల ట్రాఫిక్ పెరిగి నందున త్వరలో ఓ పార్కింగ్ ప్రాంతాన్ని గుర్తించి, అక్కడకు మార్పు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి 10, సాయంత్రం 5-8:30 గంటల మధ్య రోడ్డుపై వాహనాలు నిలుపకుండా పార్కింగ్ ప్లేస్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌ఐ సత్యన్నారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోలీసు సిబ్బందికి సన్మానం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ సిబ్బంది ఆరుగురు సిబ్బంది బదిలీ అయ్యారు. వారిని గురువారం స్టేషన్‌లో సీఐ వీరేంద్రబాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో బదిలీలు సాధారణమని, వృత్తిలో అంకిత భావంతో పనిచేయాలని చెప్పారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, హెచ్‌ఎస్‌లు రాజేష్, ఆంజనేయులు, వేణుగోపాలరావు, పీఎస్‌లు గంగరాజు, దాసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సదాశివరావు, ఏఎస్‌ఐ మొహిద్దీన్, రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి రూరల్: ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను అరికట్టేలా తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకోవడం, ఇతర సమాచారం కోసం హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.